# శత్రువు

మరోసారి వీధివైపు చూశాను. నగరం చచ్చిపోయింది. శతసహస్ర వాహనాల కదలికతో కొట్టుకునే నగర హృదయం ఆగిపోయి వుంది. అటూ, ఇటూ చూసి, రెండడుగుల ముందుకు వేశాను. నా పాదాల సవ్వడికి నాకే భయం వేసింది.

కర్ఫ్యూ అమలుపరిచే పోలీసుల చేతికి చిక్కకుండ, మతోన్మాదుల కంటపడకుండ యిల్లు చేరగలనా?

ఒక్క నక్షత్రము కూడా కనపడని ఆకాశం కర్ఫ్యూ అమలులో వున్న నగరమలా వుంది. కరి మబ్బు వెనుక దాగి, అప్పుడప్పుడు బయటకు వస్తూ, పయనిస్తున్న చంద్రుడు, నా ప్రతిబింబమలా కనిపించాడు.

హఠాత్తుగా ఆగిపోయాను నేను. ఏదో అలికిడి అయినట్లనిపించింది. కళ్ళు చిట్లించి మళ్ళీ, మళ్ళీ చూశాను. చీకట్లో ఏమీ కనిపించలేదు.

ఏ కుక్క అయినా అయి వుండవచ్చని అనుకున్నాను. ఏ నవాబో కట్టించిన, శిథిలమైన ఆ కోటలో కుక్కలు, గబ్బిలాలు, ఇతర పక్షులు నివాసం ఏర్పరచుకొని వుండవచ్చు!

జాగ్రత్తగా అడుగులు వేశాను. వీధి గుమ్మానికి దగ్గరగా ఉన్న స్తంభందాటుతూ వుంటే కాళ్ళకి ఏదో మెత్తగా తగిలింది.

తుళ్ళిపడ్డాను నేను. ఏ పామునైనా తొక్కలేదు కదా? నేల మీదకు వంగి జాగ్రత్తగా చూశాను.

నేల మీద ఎవరో కూర్చుని వున్నారు! "మీరు" లేస్తు అడిగేడు అతను. "మీ పేరు...." అతని గొంతులో కంగారు, భయము వ్యక్తమవుతోంది.

"మీ పేరు...." నేను ఎదురు ప్రశ్న వేసాను. మనిషి, మనిషిని నమ్మలేని రోజులు! ఎదురుగా నిలబడిన వ్యక్తి నా మతానికి చెందినవాడా, కాదా అని తెలుసుకోవడం అతిముఖ్యం. అది తెలిస్తే కానీ జీవితము సురక్షితమా, కాదా, అని తెలియదు. నగరమంతా మతకలహాలతో అల్లకల్లోలముగా వుంది.

"పేరుతో పని ఏముందిలెండి" నాలాగే పేరు చెప్పడం ఇష్టం లేని అతడు అడిగాడు. "పోనీ మీరు ఎక్కడ ఉంటున్నారు? పాత బస్తీయా...."

అతని ఎత్తు నాకర్థం అయింది. నగరంలోని ప్రాంతాలలో ఏదో ఒక మతముకు చెందిన వారే ఎక్కువగా ఉంటారనే వాస్తవాన్ని ఆయుధంగా వాడుతున్నాడతను.

"మీ భయం నాకర్థమైంది. మీ మతం ఎక్కడ తెలిసిపోతుందోనని భయపడుతున్నారు కదూ?" నేను జవాబు చెప్పకపోవడంతో అతనన్నాడు "నాకు మీ మతంతో పనిలేదు. ఓ మనిషిగా తోడుంటారేమోనని అనుకున్నాను. నా ప్రాంతము వారయితే కలసి వెళ్ళవచ్చు కదాననేది నా ఆశ"

అతను నాకు దగ్గరగా జరిగేడు. చీకట్లో అతని ముఖం కనిపించలేదు. కానీ, అతని చేతిలో ఉన్న చిన్నపెట్టె స్పష్టంగా కనిపించింది.

ఆ పెట్టెలో పిస్టల్ ఉంటుందేమో! బహుశా నాటు బాంబులు కూడా ఉండవచ్చు.

నేను వెనక్కి జరిగేను. మరో దారి నుంచి పరిగెడితే...

అతను అది గమనించినట్లున్నాడు. "ఆగండి" అతనన్నాడు. "భయపడకండి. నేను దొంగనూ కాను, మతోన్మాదిని అంతకన్నా కాను. ఉద్యోగం చేసి బ్రతికే మామూలు కార్మికుడిని"

కార్మికుడా!

"..... ..... కంపెనీలో మెకానిక్‌ని"

"నేను మెకానిక్‌నే"

అతను మరీ దగ్గరకు జరిగేడు. నాకు భయం వెయ్యలేదు.

ఏవేవో చెబుతున్నాడు అతను. వాళ్ళ కంపెనీలో కేంటీన్ భోజనం అసలు బాగోదట. రోజూ ఇంచుమించు పది గంటలు పని చెయ్యాలట. అయిన జీత,భత్యాలు చాలా తక్కువే నట.

"మీకు బోరు కొడుతోంది కాబోలు" ఏమీ మాట్లాడకుండా నిలబడ్డ నన్ను చూసి అతను అన్నాడు" పదండి మెల్లగా, ముందుకు వెళదాము"

అడుగులో అడుగు వేసి ముందుకు నడిచాము.

కర్ఫ్యూ అమలపరిచే పోలీసులు వీధిలో లేరని నిర్ధారణ చేసుకున్నాక, రోడ్డుమీదకు అడుగు పెట్టాము. ఒక్క కిలోమీటరు దూరం నడిచామో, లేదో దగ్గరలో ఫిస్టల్ పేలిన శబ్దం వినిపించింది.

ఎవరిదో ఆర్తనాదం.

"అల్లా హో అక్బర్" అతను ఓ నిముషం ఆగి అన్నాడు "దగ్గరలోనే ప్రమాద ముందన్నమాట"

నా గుండె ఆగిపోయింది. నాతో నడుస్తున్న అతను ముస్లిం అని తెలిసి భయం పుట్టుకొచ్చింది. నేను హిందువునని అతనికి తెలిస్తే.....

అతని పెట్టెలో ఫిస్టల్ ఉండవచ్చు. ముందుకు పరుగుతీశాను.

"ముందర ప్రమాదముంది" అతను నన్ను వెనక్కు లాగుతూ అన్నాడు. "ఫిస్టల్ పేలింది కదా? ఎవరినో చంపి వేసినట్లున్నారు."

అతని నుంచి దూరంగా పారిపోవడానికి ప్రయత్నించాను. కానీ, కుదరలేదు. బలవంతంగా ఓ చెత్తకుండీ దగ్గరకు లాక్కు వెళుతూ అన్నాడు, అతడు "వెధవ నగరం! మనిషిని ధైర్యంగా నడవనివ్వడం లేదు"

"అంతా మీ వాళ్ళదయే కదా?" నేను కోపంగా అడిగేను. "గొడవ మొదలు పెట్టింది మీ వాళ్లే కదా?"

"మా వాళ్ళేమిటి, మీ వాళ్ళేమిటి?" చెత్తకుండీ వెనుక దాక్కుంటూ అన్నాడు అతను. "ఎవరో కొంతమంది స్వార్థపరులు చేసే పనులకు బాధ్యత మనదా? ఏదో కాయకష్టం చేసి బ్రతుకుని ఈడ్చే వాళ్లం మనకూ, మనకూ గొడవ లేమిటి? కక్షలేమిటి"

దూరం నుంచి పోలీసు జీపు వస్తున్న శబ్దం వినిపించింది. జీపు బల్బుల కాంతికి కనబడిపోతామేమోనని భయం వేసింది.

మరికొంత దగ్గరగా కూర్చున్నాము. ఇద్దరము. "అప్పుడే అర్ధరాత్రి దాటిపోయింది" అతను నిట్టూర్చాడు. జీపు లైట్ల కాంతిలో వాచీ చూసుకున్నాడు.

"నేనింకా ఎప్పుడు ఇల్లు చేరతానో, మా పిల్లలు కొత్త బట్టలు ఎప్పుడు వేసుకుంటారో!" కర్చీఫ్‌తో కళ్ళు వత్తుకున్నాడు అతను. "ఈ రోజు మధ్యాహ్నం దాకా అప్పు యివ్వలేదు ఆఫీసులో. నిన్ననే యిచ్చిఉంటే రంజాన్‌కి యిల్లు చేరుకొనేవాడిని. పిల్లలు కొత్త బట్టలు వేసుకునేవారు" అతని గొంతు జీరబోయింది.

నాకు జాలివేసింది. పండుగకు వస్తానన్న నాన్నకోసం ఎదురుచూసి, చూసి అలసిపోయి బరువెక్కిన కళ్ళతో నిద్రపోయే అతని పిల్లల దయనీయమైన మొహాలు నా మదిలో కదిలాయి!

"ఈ కర్ఫ్యూలో నేను మాత్రం సరదాగా బయలుదేరనా?" నా బాధ కట్టలు తెంచుకుని ప్రవహించింది. "మా ఆవిడకు తొలికాన్పు కష్టంగా వుందని ఫోను వస్తే బయలుదేరాను. ఎలా వుందో, ఏమో?" నేను రోడ్డు వేపు దృష్టి మళ్ళించాను. అంతా చీకటే.

"ఉన్న సమస్యలతోనే వేగలేక పోయే మనకి, ఈ మత కలహాలేమిటి, మత విద్వేషాలేమిటి?" అతనన్నాడు.

ఇద్దరమూ లేచాము. ముందుకు నడుస్తూ వుంటే అతను అన్నాడు "ఆగండి రెండు బిస్‌కట్లు తిని వెళదాము"

నేను జేబులోంచి అగ్గిపెట్టె తీసి వెలిగించాను. పెట్టె తెరిచాడు అతను. ఆ పెట్టెలో అమర్చిన కొత్త బట్టలు ఒక ప్రక్కకు జరుపుతూ అన్నాడు. "ప్రతీ సంవత్సరమూ రంజాన్ చంద్రుడు కనబడకముందే యింట్లో వుండేవాడిని! "బిస్‌కట్‌పేకట్టు బయటకు తీశాడు అతను.

రెండు బిస్కెట్లు తిని నీళ్ళు తాగితే కొంత ఉత్సాహం కలిగింది.

మళ్ళీ నడక ప్రారంభించాడు.

నాకు ధైర్యంగా వుంది. నాతో మరో మనిషి వున్నాడనేదే ఆ ధైర్యానికి కారణం.

"ఇంకా నేను వెళతాను" నాలుగు వీధుల కూడలికి రాగానే అన్నాడు అతను. ఆకూడలి నుంచి కుడివైపు తిరిగితే అతని ఇల్లు వస్తుండట!

హైదరాబాదు నగరం బాగా అలవాటయిన నాకు అతని ఇల్లు ఎక్కడ వున్నది అని ఊహించటము కష్టం కాలేదు.

"ఇంక నాకు భయంలేదు" వీధి వైపు తిరుగుతూ అన్నాడు అతను "ఇక్కడ అంతా మావాళ్ళే. మీరు జాగ్రత్త".

అతను ముందుకు నడిచేడు. నేను నా దారిన అడుగువేశాను. మళ్ళీ ఫిస్టల్ పేలిన శబ్దం వినిపించింది. హఠాత్తుగా ఆగిపోయాను. చుట్టూ చూశాను. చిమ్మ చీకటి! ఏమీ కనిపించలేదు.

అగ్గిపుల్ల వెలిగించి చూశాను. నాకు కాళ్లు, చేతులు ఆడలేదు.

నేలమీదకు ఒరిగిపోతున్నాడు అతను. అతని చేతిలోని పెట్టెను లాగేసుకుని పరుగెడుతున్నాడు ఒకడు.

ఒక్క నిముషం అలాగే వుండిపోయాను. ఆ తరువాత వెనక్కుతిరిగి కుడివైపు రోడ్డు మీద పరుగెత్తాను అతని ఇంటికి.

అప్పుడు నేను హిందువన్నది కానీ, నేను వెళుతున్నది ఒక ముస్లిమ్ ప్రాంతానికనేది కానీ, నగరం హిందూ, ముస్లిం గొడవలతో మండిపోతోందన్నది కానీ, నాకు భయం కలిగించలేదు.

ఎందుకంటే....

నా నిజమైన శత్రువు ఎవరన్నది నాకు తెలిసిపోయింది కనుక.

(ఈ వారం కథ ఆంధ్రజ్యోతి 7-10-94)